# ఇదం జగత్

నల్లటి బారుమీసాలు తిరిపెడ్తూ పొన్నుకర్ర పాడుచుకుంటూ మల్లుపంచె కొంగు ఓరగాచేత్తో ఒడిసి పట్టుకొని, సిల్కు లాల్చీ మెరుపుల్ని చుట్టుపక్కలవాళ్ళు గమనించేలా చెణుకులు విసుర్తూ సబ్‌రిజిస్ట్రారు ఆఫీసులో జొరబడ్డాడు జోగినాయుడు.

బజారులాంటే బట్టతల, నూనెపూతకి అద్దంలా మెరుస్తూండగా కారాకిళ్ళీ ఆ బుగ్గనుంచి ఈ బుగ్గకి బదిలీ చేసి – పుక్కిట మంచినీళ్ళు గుటకేసి కొండంత ఎత్తు కాగితాలు ముందుపడేసుకుని చిత్రగుప్తుని చిట్టాలా రాసుకుపోతున్నాడు పరంధామయ్య.

లోకం ఎలా పోతున్నా ఆ కుర్చీలో కూర్చొన్నంతసేపు అతనికి పట్టదు.

పరంధామయ్య పరపతి సబ్‌రిజిస్ట్రారన్న మాటేమిటి, కాస్తోకూస్తో వీధినిబడ్డ ఏ పెద్ద మనిషికన్నా ఎరుక.

సబ్‌రిజిస్ట్రారు తరువాత మళ్ళీ అంతటివాడు, ఇరవై యేళ్ళ సర్వీసులో పండి ముదిరిన మహామేధావి పరంధామయ్య.

కానైతే జోగినాయుడు ఆ ఊరికి కొత్త.

పరంధామయ్య కేను!

వస్తూనే చేతులు జోడించి నమస్కారబాణం ప్రయోగించాడు పరంధామయ్య మీదికి.

తలొంచుకొని రాసుకుపోతూనే ఉన్నాడు పరంధామయ్య. కూర్చోమనన్నా అనలేదు.

మొదట ఆశాభంగాన్ని నిభాయించుకున్నాడు నాయుడు. ఎదురుగా ఉన్న కోడు విరిగిన బెంచిమీద శరీరం చేరేసి బట్టతల వేపే చూస్తూ ఓసారి ఆవలించేడు.

ఎంతకూ పరంధామయ్య పలకలేదు.

అటుచూసి, ఇటుచూసి – విసుగుతో లేచినిలబడి ఒకటి రెండుసార్లు బయటకీ, లోపలికీ నడిచి చివరకి పరంధామయ్య దగ్గరికి మళ్ళీ వచ్చి నిలబడ్డాడు.

"సార్ నేను వచ్చిన పని"

"... ... ... ... ..."

"ఇంటి విషయం ..."

"... .... ... ... ..."

"కూర్చోమన్నా కూర్చుంటా. తొందర్లేదు"

ఇన్ని మాటలన్నా ఒక్కమాటన్నా జవాబు చెప్పకపోయేసరికి విస్తుపోయాడు నాయుడు. కనీసం తలన్నా ఎత్తలేదు పరంధామయ్య. అలానే ఏదో రాసుకుంటున్నాడు.

పావుగంట తర్వాత మళ్ళీ అడిగాడు.

"నా యింటి తనఖా విషయం –"

"... .... .... ... ..."

"ఆరువారాలయింది – అప్లికేషన్ పెట్టి"

"... ... ... ... ..."

"మాట మాత్రం"

కిక్కురుమనలేదు పరంధామయ్య.

తనతో ఎవరో మాట్లాడుతున్నారన్న చలనమే లేదతనిలో.

చకితుడయాడు నాయుడు.

ఓసారి బయటికి వెళ్ళొచ్చాడు. నౌకరుతో అన్నాడు "అల్లక్కడ కుర్చీలో కూర్చున్నతనికి చెముడా ఏమిటి?

"అబ్బే! లేదండి"

"మరి మాట్లాడడేం?"

"అతనంతే నండి"

"అంటే"

"అంటే ..." బొటనవేలు చూపుడువేలుకు మోపి 'డబ్బు' అన్నట్టు చూపాడు నౌకరు.

అంతే –

లోపలికి వచ్చాడు నాయుడు. జేబులోంచి ఓ రూపాయి నోటుతీసి పరంధామయ్య రాసుకుంటున్న పుస్తకం మీద అతని కళ్ళ కెదురుగ్గా ఉంచాడు.

పుస్తకం చటుక్కున మూశాడు పరంధామయ్య. నోటు అందులోనే ఉండిపోయింది.

"ఇప్పుడు కాస్త చూడండి నా విషయం"

అప్పటికీ మాట్లాడలేదు పరంధామయ్య.

ఓసారి లేచి వెళ్ళి దూరంగా ఉన్న బీరువాలోంచి ఏదో పుస్తకం తెచ్చుకొని మళ్ళీ తన కుర్చీలో కూర్చొని రాసుకుపోతున్నాడు.

ఈసారి మరో రూపాయి జేబులోంచి తీశాడు జోగినాయుడు. పుస్తకం మీద ఉంచాడు.

దానివేపు కన్నెత్తి కూడా చూడలేదు పరంధామయ్య. కలంతో నుదురు గోక్కొని ఏదో రాసుకుంటున్నాడు.

ఉస్సురుమని ఎదుట బెంచీ మీద చతికిల బడ్డాడు నాయుడు. ఏం చెయ్యడానికి పాలుపోలేదు.

మళ్ళీ కూర్చొన్న చోటునుంచి లేచాడు. బయటికి వచ్చాడు.

"ఏం! ఇచ్చారా?" నౌకరడిగాడు.

"రెండు" అన్నాడు నాయుడు.

"మరొకటి కూడా ఇవ్వండి చాలు. అది మామూలు"

ఈసారి లోపలికి వచ్చాడు నాయుడు. అతనికి తల తిరిగిపోతోంది.

నిస్పృహ మనస్సు ఆవరించుకున్నది. అయినా దిటవు పర్చుకుని జేబులోంచి మరో రూపాయి తీసి పరంధామయ్య ముందుంచాడు.

అక్కడికి మామూలు మూడూ పూర్తయింది. చటుక్కున తలెత్తాడు పరంధామయ్.

చిరునవ్వు నవ్వుతూ నాయుడిని ఆహ్వానించాడు.

కుర్చీ చూపాడు.

"కూర్చోండి నాయుడుగారూ! ఏం కావాలి తమకు? చెప్పండి" అనడిగాడు అప్పుడే నిద్ర లేస్తున్న వాడిలాగ –!

---